

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ ఇంటింటి ప్రచారం చేపట్టింది. సరూర్‌నగర్ డివిజన్‌లోని చెరుకుతోటకాలనీలో కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిఅంజన్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. చేవెళ్ల ఎంపీగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి ఓట్లు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. బీజేపీ కోకన్వీనర్ జైన్‌బాబు, గోవర్ధన్, ఆకుల అంజన్ పాల్గొన్నారు. - ఎల్‌బీనగర్, ఆంధ్రజ్యోతి



పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా శుక్రవారం రాత్రి మలక్‌పేట సిమ్లా గార్డెన్‌లో జరిగిన ఇఫ్తార్ విందులో ముస్లిం సోదరుడికి ఖర్జూర తినిపిస్తున్న టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్, పక్కన కాంగ్రెస్ మలక్‌పేట ఇన్‌చార్జి షేక్ అక్బర్ తదితరులు - చాదర్‌ఘాట్, ఆంధ్రజ్యోతి

కుంట్లూర్‌లో అక్రమ షెడ్ల కూల్చివేత

- కన్జర్వేషన్ జోన్‌లో నిర్మాణాలు
- హైకోర్టు ఆదేశాలతో రంగంలోకి దిగిన అధికారులు

అబ్దుల్లాపూర్‌మెట్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ కుంట్లూర్ పరిధిలో వెలసిన షెడ్లను మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. కుంట్లూర్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 234, 235లోని కన్జర్వేషన్ జోన్‌లో కొంత కాలం క్రితం అక్రమంగా భారీ షెడ్లను (టైల్స్ గోదాంలు) నిర్మించారు. అక్రమ షెడ్ల నిర్మాణాలపై కొందరు మున్సిపల్ ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేయగా మరి కొందరు కోర్టుకు వెళ్లారు. దీంతో అక్రమ షెడ్ల విషయంలో అధికారులపై కోర్టు సైతం సీరియస్ అయినట్లు తెలిసింది. హైకోర్టు ఆదేశాలతో శనివారం మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి, అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ రవీందర్‌దత్ ఆధ్వర్యంలో డిస్ట్రిక్ టాస్క్‌ఫోర్స్(డీటీఎఫ్) సహకారంతో ఎక్సకవేటర్ల సహాయంతో షెడ్లను కూల్చివేశారు. షెడ్లలో భారీగా టైల్స్‌స్టాక్ నిల్వ ఉండడంతో షెడ్ల సైడ్ రేకులను మాత్రమే తొలగించారు. గోదాంలలో ఉన్న టైల్స్‌ను తరలించేందుకు వాటి నిర్వాహకులు రెండు వారాల గడువు కోరినట్లు కమిషనర్ తెలిపారు. టైల్స్ తరలించిన అనంతరం వాటిని పూర్తిగా కూల్చివేస్తామని తెలిపారు. అదేవిధంగా మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలన్నింటికీ నోటీసులు అందించినట్లు తెలిపారు. ఉన్నత అధికారుల ఆదేశాలతో త్వరలోనే వాటిని కూడా కూల్చివేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీపీవో శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.



షెడ్ల రేకులను తొలగించిన దృశ్యం



అక్రమ షెడ్లను ఎక్సకవేటర్‌తో కూల్చివేయిస్తున్న సిబ్బంది

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

జోన్ బృందం : బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఎల్బీనగర్, దిల్‌సుఖ్‌నగర్ జోన్ పరిధిలో శనివారం ఆ పార్టీ శ్రేణులు ఘనంగా జరుపుకున్నాయి. మలక్‌పేట సలీంనగర్‌లో బీజేపీ పతాకాన్ని హైదరాబాద్ పార్టీ ఎంపీ అభ్యర్థి మాధవీలత ఆవిష్కరించారు. బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, మాజీ రాజ్యసభ సభ్యుడు గరికపాటి రామ్మోహన్‌రావు పార్టీ జెండాలను ఆవిష్కరించారు. వనస్థలిపురం, బీఎన్‌రెడ్డినగర్, మన్సూరాబాద్ డివిజన్లలో జెండాలను కార్పొరేటర్లు రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, మొద్దు లచ్చిరెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డిలు ఆవిష్కరించారు. సైదాబాద్, ఐఎస్‌సదన్, కుర్మగూడ డివిజన్లలో కార్పొరేటర్ కొత్త కాపు అరుణారవీందర్‌రెడ్డి, చంపాపేట, వినయ్‌నగర్‌లలో పార్టీ పతాకాలను కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి ఆవిష్కరించారు. మన్సూరాబాద్ డివిజన్‌లోని హయత్‌నగర్ వై జంక్షన్, బొమ్మలగుడి వద్ద కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించారు. డివిజన్‌లోని చంపాపేట చౌరస్తా, కర్మన్‌ఘాట్‌లలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి పార్టీ జెండాలను ఎగరవేశారు.



వనస్థలిపురం హిల్‌కాలనీలో బీజేపీ జెండా ఆవిష్కరణలో మాజీ ఎంపీ గరికపాటి రామ్మోహన్‌రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి



మలక్‌పేట సలీంనగర్‌లో బీజేపీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న పార్టీ ఎంపీ అభ్యర్థి మాధవీలత, జిల్లా ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు కొప్పుల దినేష్ తదితరులు



హస్తినాపురం డివిజన్ నుంచి జనజాతర సభకు వెళ్తున్న వాహనాన్ని ప్రారంభిస్తున్న టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కిగౌడ్, కార్పొరేటర్ సుజాతనాయక్, చంద్రశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు

జనజాతర సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు

చంపాపేట, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్ నుంచి కార్పొరేటర్ సుజాతనాయక్, కాంగ్రెస్ నేత చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం తుక్కుగూడలో జరిగిన జనజాతర సభకు పలు వాహనాలలో నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలివెళ్లారు. టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ జెండా ఊపి వాహనాల ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో డివిజన్ పార్టీ అధ్యక్షుడు శశిధర్‌రెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు పాలకుర్ల రవికాంత్‌గౌడ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జనజాతర సభకు తరలివెళ్తున్న ఎమ్మెల్యే రంగారెడ్డి ఇతర నాయకులు

హయత్‌నగర్: జనజాతర సభకు తుర్కయంజాల్ మున్సిపాలిటీ నుంచి పెద్ద ఎత్తున కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తరలివెళ్లారు. తొర్రూర్‌లోని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి క్యాంపు కార్యాలయం నుంచి పలువురు సభకు తరలివెళ్లారు.



విష్ణునాథ్‌ను సన్మానిస్తున్న ఆలయ డైరెక్టర్ ఆనంద్‌కుమార్‌గౌడ్

ఏఐసీసీ సెక్రటరీని కలిసిన ఆలయ డైరెక్టర్

చంపాపేట, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయ డైరెక్టర్, కాంగ్రెస్ నాయకుడు బబ్బూరి ఆనంద్‌కుమార్‌గౌడ్ శనివారం ఏఐసీసీ సెక్రటరీ, తెలంగాణ ఇన్‌చార్జి పీసీ విష్ణునాథ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి ఆయనను ఘనంగా సన్మానించి మెమోంటోను అందజేశారు. ఈ సందర్భంగా విష్ణునాథ్ మాట్లాడుతూ మల్కాజిగిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీత మహేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీధర్‌గౌడ్, భాస్కర్‌నాయక్, వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న హమాలీ కార్మికులు

14లోగా కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నర్సిరెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): ఈ నెల 14వ తేదీలోగా పండ్ల మార్కెట్‌లో పని చేస్తున్న హమాలీ కార్మికుల సమస్యను పరిష్కరించాలని లేనిపక్షంలో ఆ రోజు నుంచి సమ్మెకు వెళ్తామని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కీసరి నర్సిరెడ్డి హెచ్చరించారు. శనివారం బాటసింగారంలోని పండ్ల మార్కెట్‌లో హమాలీ కార్మికులతో కలిసి ర్యాలీ నిర్వహించి మార్కెట్ కమిటీ అధికారులతో కలిసి చర్చించారు. అనంతరం నర్సిరెడ్డి మాట్లాడుతూ ఇటీవల జిల్లా అడిషనల్ కలెక్టర్‌తో జాయింట్ సమావేశం జరిగిందని మరో పది రోజులు వేచి చూడాలని చెప్పినట్లు తెలిపారని పేర్కొన్నారు. కొన్ని ఏళ్లుగా హమాలీ చార్జీలు పెంచకపోవడంతో కార్మికులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మార్కెట్‌లో పని చేస్తున్న కార్మికులందరికీ లైసెన్సులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతంలో ఇచ్చిన చార్జీల పెంపు హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు సోచయ్య, షరీఫ్, మున్నా, శివశంకర్, రాములు, బాలాజీ, మల్లయ్య, సూరిబాబు, నాగిరెడ్డి, రాజు పాల్గొన్నారు.

చలివేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

వనస్థలిపురం, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): వేసవి కాలంలో బాటసారుల దాహార్తిని తీర్చడానికి ఏర్పాటు చేసే చలివేంద్రాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు, సామాజిక వేత్త గద్దె విజయ్ నేత అన్నారు. శనివారం బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ గాయిత్రినగర్ బ్యాంక్ కాలనీలోని సాయిబాబా ఆలయం వద్ద గద్దె విజయ్ నేత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని దుబాయ్ రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయ్ నేత మాట్లాడుతూ వేసవి కాలంలో చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగ పడుతాయని వాటిని బాటసారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జాగృతి అభ్యుదయ సంఘం చైర్మన్ భావన శ్రీనివాస్, కాలనీ ఉపాధ్యక్షుడు జీ.శేఖర్, ప్రధాన కార్యదర్శి ఎస్.రవికుమార్, ఉపేందర్, ఉదయ్, మారుతమ్మ, సంతోష్, కార్పెంటర్ శ్రీను, మల్లేష్, హనుమంతరావు, శ్రీకాంత్‌రెడ్డి, మనోహర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి మృతి

పీర్జాదిగూడ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జాతీయ రహదారిలోని నారపల్లి వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి మృతిచెందాడు. మేడిపల్లిలో నివాసముండే సాయిగణేష్ (20) అనురాగ్ యూనివర్సిటీలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. బైక్‌పై కాలేజీకి వెళుతుండగా నారపల్లి నందనవనం వద్ద లారీని దాటే క్రమంలో అదుపు తప్పి కిందపడ్డాడు. తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేస్తున్నారు.

పార్లమెంట్ ఎన్నికలను సజావుగా నిర్వహించాలి

- ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్, ఏఆర్‌ఓ ముకుందరెడ్డి

హయత్‌నగర్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకుని ఎల్‌బీనగర్ నియోజకవర్గానికి చెందిన అదర్ పోలింగ్ ఆఫీసర్ శిక్షణ శిబిరం శనివారం హయత్‌నగర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట జరిగింది. ఈ సందర్భంగా అదర్ పోలింగ్ ఆఫీసర్లకు డిస్ట్రిక్ లెవల్ మాస్టర్ ట్రైనింగ్(డీఎల్ఎంటీ) అసెంబ్లీ లెవల్ మాస్టర్ ట్రైనింగ్(ఏఎల్ఎంటీ) ఇచ్చారు. దాదాపు 110 మంది అధికారులు ఇందులో పాల్గొని శిక్షణ తీసుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ ముకుందరెడ్డి(ఏఆర్‌ఓ)హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలను సజావుగా నిర్వహించాలని అధికారులను కోరారు. ఎక్కడ ఎలాంటి అవగాహన రాహిత్యం కనిపించవద్దని అన్నారు. ఎన్నికలకు అవసరమైన అన్ని రకాల శిక్షణ తీసుకుని ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలన్నారు. నిర్వహణపై ఎలాంటి అనుమానాలు ఉన్నా డిస్ట్రిక్ లెవల్ మాస్టర్ ట్రైనర్లను, అసెంబ్లీ లెవల్ మాస్టర్ ట్రైనర్లను అడిగి తెలుసుకోవాలన్నారు. ఏ రిజిస్టర్ ఎలా నింపాలో, ఈవీఎంలను ఏవిధంగా ఆపరేట్ చేయాలో వివరించారు. డీసీ, ఈఆర్‌ఓలు యాదయ్య, సుజాత, హయత్‌నగర్ తహసీల్దార్ జానకి, డిప్యూటీ ఎస్టేట్ ఆఫీసర్, ట్రైనింగ్ నోడల్ ఆఫీసర్ విజయలక్ష్మి, డిస్ట్రిక్ లెవల్ మాస్టర్ ట్రైనర్ శరత్, అసెంబ్లీ లెవల్ మాస్టర్ ట్రైనర్లు సురేష్, రమేష్ పాల్గొన్నారు.



శిక్షణశిబిరంలో మాట్లాడుతున్న ఏఆర్‌ఓ ముకుందరెడ్డి



శిక్షణ తరగతులకు హాజరైన వివిధ శాఖల ప్రభుత్వ ఉద్యోగులు

సిమ్మింగ్‌పూల్‌లో బాలున్ని ముంచిన ఇద్దరిపై కేసు నమోదు

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 6: ఓ మైనర్ బాలున్ని సిమ్మింగ్‌పూల్ ముంచి హత్యాయత్నానికి పాల్పడిన ఇద్దరిపై ఘట్‌కేసర్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ సైదులు తెలిపిన వివరాలప్రకారం... బిహార్‌కు చెందిన ఓ కుటుంబం ఇటీవల ఘట్‌కేసర్‌కు వలసొచ్చి కూలీపనులు చేసుకుంటోంది. వారి కుమారుడు పాఠశాలకు సెలవు ఉన్నపుడల్లా స్థానిక ఫ్లవర్‌షాప్‌లో పనిచేసేవాడు. గత ఫిబ్రవరి నెలలో కొన్నిరోజులు పనికి రాలేదు. దీంతో షాప్ యజమాని రఫీక్, అతడి స్నేహితుడు ఇంతియాజ్ కలిసి బాలున్ని తీసుకుని కొండాపూర్‌లోని సిమ్మింగ్‌పూల్‌కు వెళ్లారు. సిమ్మింగ్ చేస్తుండగా బాలున్ని రఫీక్, ఇంతియాజ్ నీళ్లలో ముంచుతూ ఊపిరి ఆడకుండా చేస్తూ సెల్‌ఫోన్‌లో చిత్రీకరించారు. బయట ఎవరికైనా చెప్పితే చంపుతామని బాలున్ని బెదిరించారు. గతంలో వారు సెల్‌ఫోన్‌లో తీసిన సన్నివేశాలను శనివారం బాలుడి తల్లికి పంపారు. దీంతో తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మన ఆరోగ్యం మన హక్కు

- న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి ఇందిర

ఎల్‌బీనగర్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): మన ఆరోగ్యం మన హక్కని రంగారెడ్డి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఇందిర చెప్పారు. శనివారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సరూర్‌నగర్‌లోని ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అవగాహన ర్యాలీని ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ప్రజల ఆరోగ్య స్థాయిని మెరుగుపర్చడానికి ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతి సంవత్సరం ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహిస్తుందన్నారు. ప్రతి మనిషికి సరసమైన ధరలో మంచి ఆరోగ్య సౌకర్యాలు లభిస్తాయన్న ఆలోచన దీనికి కారణమన్నారు. ప్రపంచ వ్యాప్తంగా మిలియన్నర మంది ప్రజలు అనేక భయంకరమైన వ్యాధులకు గురవుతున్నారన్నారు. అందువల్ల వ్యాధుల నివారణ వంటి అంశాలపై చర్చలు, అవగాహన కూడా ఆరోగ్య దినోత్సవం ప్రధాన లక్ష్యమన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం శారీరకంగా, మానసికంగా, సామాజికంగా ఆరోగ్యంగా ఉండటం మానవ ఆరోగ్యానికి నిర్వచనమన్నారు. డీఎంహెచ్ఓ వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య దినోత్సవం కోసం ప్రతి సంవత్సరం ఒక థీమ్ సెట్ చేయబడుతుందన్నారు. ఈ అంశంలో ప్రత్యేక ఆరోగ్య సమస్యతో పాటు ప్రపంచ ఆరోగ్య దినోత్సవ కార్యకలాపాలు ఎంచుకున్న అంశం చుట్టూ తిరుగుతాయన్నారు. సాధారణంగా ఆరోగ్యం ప్రాముఖ్యతను సూచించడానికి కార్యకలాపాలు నిర్వహించబడతాయన్నారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ రిహాబిలిటేషన్ ఆఫీసర్ రమేష్, రంగారెడ్డి వైద్య ఆరోగ్య శాఖ వైద్యులు అరుణకుమారి, అరుణ, స్వర్ణకుమారి, అనిత, వినోద, గీత, దామోదర్, ధరణికుమార్, రాకేష్, అంబిక, అర్చన, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి ఇందిర

మోదీ మళ్లీ ప్రధాని కావాలని ప్రపంచ దేశాలు కోరుకుంటున్నాయ్

- మాజీ ఎంపీ గరికపాటి రామ్మోహన్‌రావు

వనస్థలిపురం, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): నరేంద్రమోదీ మళ్లీ భారత ప్రధాని కావాలని ప్రపంచ దేశాలు కోరుకుంటున్నాయని రాజ్యసభ మాజీ సభ్యుడు గరికపాటి రామ్మోహన్‌రావు అన్నారు. వనస్థలిపురం డివిజన్ పరిధిలోని వనస్థలిపురం హిల్‌కాలనీ కమ్యూనిటీ (పోలింగ్ బూత్ 299, 300) హాల్లో బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఆధ్వర్యంలో టిఫిన్ బైఠక్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గరికపాటి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 13న జరుగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో 299, 300 పోలింగ్ బూత్‌లలో గతంలో వచ్చిన ఓట్ల కంటే అధికంగా ఓట్లు రావాలని బీజేపీ కోరుతుందన్నారు. నరేంద్రమోదీ ప్రధానిగా ఉంటేనే శాంతి భద్రతలు పటిష్టంగా ఉంటాయన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరి ఎంపీగా ఈటెల రాజేందర్ తప్పనిసరిగా గెలుస్తారని తెలిసినప్పటికీ, ఇంకా అదనంగా ప్రతి పోలింగ్ బూత్‌లో 370 ఓట్లు రావాలన్నారు. ఎల్‌బీనగర్‌లోని 570 బూత్‌ల ఇన్‌చార్జీలు, నాయకులు, కార్యకర్తలు లక్ష్యం పెట్టుకుని ఎల్‌బీనగర్ నియోజకవర్గం నుంచి అత్యధిక మెజార్టీ సాధించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు కొత్త రవీందర్‌గౌడ్, జక్కిడి ప్రభాకర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు నూతి శ్రీనివాస్, నాయకులు మధుకర్‌గౌడ్, బద్దం రాంరెడ్డి, కిరణ్‌యాదవ్, భద్రరాజు, రాజ్ కుమార్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.



టిఫిన్ బైఠక్ కార్యక్రమంలో మాజీ ఎంపీ గరికపాటి రామ్మోహన్‌రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య



హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన చైతన్యపురి పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సీటీవో కాలనీ కొత్తపేటలో ఉంటున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి దేరంగుల నరేష్‌కు, బీఎన్‌రెడ్డినగర్‌కు చెందిన శిరీషతో కొన్నాళ్ల క్రితం వివాహం జరిగింది. పెళ్లయినప్పటి నుంచి భార్యాభర్తలకు మధ్య గొడవలు జరుగుతున్నాయి. కొద్దిరోజుల తర్వాత శిరీష్ బీఎన్‌రెడ్డినగర్‌లోని పుట్టింటికి వెళ్లింది. దాంతో నరేష్ న్యూజీలాండ్ వెళ్లాడు. ఈ క్రమంలో శిరీష ఆడబిడ్డకు జన్మనిచ్చింది. దాంతో నరేష్ న్యూజిలాండ్ నుంచి తిరిగి వచ్చాడు. ఆ తర్వాత శిరీష తల్లిదండ్రులు పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టారు. అయినప్పటికీ భార్యభర్తల మధ్య వివాదం సద్దుమణగలేదు. గత నెలలో పెద్దల ముందు పంచాయితీ జరిగింది. అయినా భార్య పుట్టింట్లోనే ఉంది. జీవితంపై విరక్తి చెందిన నరేష్ తన ఇంట్లో చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు నరేష్ సోదరుడు నవీన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చైతన్యపురి ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు.

'గృహజ్యోతి' వల్ల ఉద్యోగాలు కోల్పోయిన బిల్ కలెక్టర్లను విధుల్లోకి తీసుకోవాలి

- యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వర్‌రావు

కవాడిగూడ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న గృహజ్యోతి పథకం వల్ల సుమారు 650 మంది విద్యుత్ బిల్‌కలెక్టర్లు ఉపాధి కోల్పోయారని, వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు కె.ఈశ్వర్‌రావు డిమాండ్ చేశారు. శనివారం ఇందిరా పార్కు ధర్నాచౌక్‌లో తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిఎస్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో యూనియన్ అధ్యక్షుడు కె.ఈశ్వర్‌రావు, ప్రధానకార్యదర్శి వి.గోవర్ధన్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్.స్వామి, రాష్ట్ర కమిటీ సభ్యుడు కె.రమేష్ మాట్లాడారు. గృహజ్యోతి పథకం వల్ల సుమారు 650 మంది బిల్ కలెక్టర్లు ఉపాధి పోయిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. బిల్ కలెక్టర్లందరికీ లేబర్ కమిషనర్ ఇచ్చిన జీవో 11 ప్రకారం స్కిల్డ్ వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వెంటనే 650మంది బిల్‌కలెక్టర్లకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా డీఈ ఆఫీసులలో పనిచేయడానికి అవకాశం కల్పించి, కమిషనర్ ఇచ్చిన ఆదేశాలప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం, విద్యుత్ సంస్థ యాజమాన్యం స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ధర్నాలో యూనియన్ నాయకులు కృష్ణయ్య, లక్ష్మయ్య, రమేష్, రాజేశ్వరి, ఆశాలత, సోమేష్‌తదితరులతోపాటు కార్మికులు పాల్గొన్నారు.



ధర్నాలో మాట్లాడుతున్న ఈశ్వర్‌రావు



మాట్లాడుతున్న బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల, కార్పొరేటర్లు

ప్రజా సమస్యలను గాలికి వదిలేసిన మేయర్

- బీజేపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ కొప్పుల, కార్పొరేటర్లు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): పార్టీ ఫిరాయింపుల చర్యలపై ఫోకస్ పెట్టిన మేయర్ ప్రజా సమస్యలు పట్టించుకోవడం లేదని బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి, కార్పొరేటర్లు ఆరోపించారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎండాకాలంలో తాగునీటి కష్టాలు, నాలాల పూడికతీత పనులు చేపట్టడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. మల్కాజిగిరి బీజేపీ కార్పొరేటర్ శ్రవణ్ మాట్లాడుతూ ఎన్నికల పేరుతో పనులు చేపట్టకుండా కొంతమంది జీహెచ్ఎంసీ అధికారులు తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. జూన్ వరకు ఎన్నికల కోడ్ ఉన్నందున నాలా పనుల్లో జాప్యం జరిగితే వర్షాకాలం ప్రజలు తీవ్ర ఇబ్బందుకు పడే అవకాశాలుంటాయన్నారు. కమిషనర్ స్పందించి ఎన్నికల కమిషన్ నుంచి అత్యవసర నాలా పనులకు అనుమతి తీసుకుని వెంటనే టెండర్లు పిలవాలని, మంజూరైన పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కౌన్సిల్‌లో ప్రజా సమస్యలపై అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వడం లేదని, సమాచార హక్కు చట్టం ప్రకారం వివరాలు అడిగినా ఇవ్వడం లేదని అన్నారు. చేసిన పనుల్లో అవినీతి, అక్రమాలు బయటపడుతాయని అధికారులు వివరాలు బయటికి చెప్పడం లేదంటూ విమర్శించారు. జీహెచ్ఎంసీ ముందున్న నాలాలో సిల్ట్ పేరుకుపోయిందని ఇక్కడే ఇలా ఉంటే గ్రేటర్ వ్యాప్తంగా నాలాల పరిస్థితులు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చన్నారు. పన్నుల వసూళ్లకు అడ్డురాని ఎన్నికల కోడ్, ప్రజా సమస్యలు తీర్చడంలో మాత్రం అడ్డొస్తుందా అంటూ ప్రశ్నించారు. సరూర్‌నగర్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి మాట్లాడుతూ ఎన్నికల ముందు గత ఎమ్మెల్యేలు హడావిడిగా అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారని ఆ పనులు నేటికి ప్రారంభం కాలేదని ఆరోపించారు. మూసాపేట కార్పొరేటర్ మహేందర్ మాట్లాడుతూ భాగ్యనగరంలో చెరువులు, నాలాలు కాపాడుకోకుంటే 2020లో వచ్చిన పరిస్థితులు మళ్లీ వస్తాయంటూ హెచ్చరించారు. చీకటి జీవోలు రద్దుచేసి జోన్ మార్పు చేస్తూ ఇచ్చిన అనుమతులు వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య

అంబేడ్కర్ జయంతి వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేయండి

పంజాగుట్ట, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల కోడ్ నేపథ్యంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతికి ఎలాంటి ఇబ్బందులూ కలుగకుండా జీహెచ్ఎంసీ అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య అన్నారు. శనివారం జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోన్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ హేమంత్ బోర్కడే సహడియోరావును పంజాగుట్ట డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ కమిటీ సభ్యులతో కలిశారు. ఏప్రిల్ 14న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా పంజాగుట్టలోని అంబేడ్కర్ విగ్రహం, ట్యాంక్‌బండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రభుత్వం తరపున అన్ని ఏర్పాట్లూ చేయాలని ఆయనను చెన్నయ్యతో పాటు కమిటీ సభ్యులు కోరారు. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ఎలాంటి ఇబ్బందులూ లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తామని జోనల్ కమిషనర్ చెప్పారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మాల ప్రజాసంఘాల జేఏసీ వైస్‌చైర్మన్ బూర్గుల వెంకటేష్, పంజాగుట్ట అంబేడ్కర్ విగ్రహ కమిటీ అధ్యక్షుడు భానుప్రకాష్, ఆల్ ఇండియా అంబేడ్కర్ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వినయ్ కుమార్, ప్రవీణ్, కుమార్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మహానగర సంకీర్తన



ట్యాంక్‌బండ్‌పై అన్నమాచార్య విగ్రహం వద్ద భక్తిగీతాలను ఆలపిస్తున్న పద్మశ్రీ డాక్టర్ పద్మరాజు

కవాడిగూడ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య సంకీర్తనలకు ప్రాచుర్యం కల్పించి ప్రతి ఒక్కరిలో భక్తి బావాన్ని పెంపొందించేందుకు తనవంతు వంతు కృషి చేస్తున్నట్లు పద్మశ్రీ డాక్టర్ శోభరాజు అన్నారు. 521వ అన్నమాచార్య ఆరాధన(అన్నమాచార్య వర్ధంతి) ఉత్సవాల్లో భాగంగా అన్నమాచార్య భావనా వాహిణి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం ఉదయం 6 గంటలకు చిక్కడపల్లిలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం నుంచి నగర సంకీర్తన ప్రారంభమై ఉదయం 7 గంటల వరకు ట్యాంక్‌బండ్‌పై ఉన్న అన్నమాచార్య విగ్రహం వరకు డాక్టర్ శోభరాజు శిష్యబృందంతో భక్తి గీతాలు ఆలపిస్తూ చేరుకున్నారు. ఉదయం 7 నుంచి 9గంటల వరకు అన్నమాచార్య భక్తిగీతాలను ఆలపించారు. మహనగర సంకీర్తన ప్రతి సంవత్సరం శోభరాజు శిష్యబృందం నిర్వహిస్తోందన్నారు. తీర్థప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.